క్లుప్తంగా

పేరంటాలమ్మ హుండీ కానుకల ఆదాయం రూ.5.45 లక్షలు

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో హుండీ కానుకలను గురువారం లెక్కించగా రూ.5,45,007 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. కార్యక్రమాన్ని దేవదాయ శాఖ అధికారి కె.వి అనురాధ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ మూడు నెలలకు అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సాయి సేవాదళ్ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడికి ఖండన

విజయవాడరూరల్: అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడ్డిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ ఉద్యాన సహాయకుడు ఎస్.రవితేజపై రైతు దాడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు భరోసా కేంద్రం ఉద్యోగుల సంక్షేమ సంఘం గురువారం ఒక ప్రకటనలో ఖండించింది. దాడి చేసిన రైతు పేరు నమోదు అయిన జాబితాలో ఉందన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఆ రైతుకు పంట నష్టం నగదు జమ కాలేదని, అయితే ఉద్యోగిపై రైతు దాడి చేయడాన్ని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కె.విజయమోహన్ ఖండించారు. ఉద్యోగిపై దాడి చేసిన రైతుపై నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదు చేయాలన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన

నున్న(విజయవాడరూరల్): గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ బీవీ శేషగిరిరావు, ఏఈ రామకృష్ణారావు గురువారం పరిశీలించారు. నిర్మాణం పనులను లబ్ధిదారులు వేగం పెంచాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా కొందరు లబ్ధిదారులు బిల్లులు రాలేదని చెప్పగా వాటిని నమోదు చేసి గృహనిర్మాణశాఖకు పంపుతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ కిషోర్‌బాబు కథనం మేరకు.. రైల్వేలో పని చేస్తున్న ఎస్.నాగశ్రీనివాస్‌రాజగోపాల్ బుధవారం బైక్ పై పెనమలూరు నుంచి బందరు రోడ్డు వైపు వెళ్తుండగా, వంతెన వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న నాగశ్రీనివాస్ రాజగోపాల్ కిందపడిపోయారు. దీంతో గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు



కంకిపాడు: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు సమర్థంగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గీతాబాయి సూచించారు. మండలంలోని ప్రొద్దుటూరు శివారు యార్లగడ్డ వారిగూడెంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతల వివరాలను సేకరించి, వైద్య సేవలు అందిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను సిబ్బంది తరచూ సందర్శించి రక్తహీనత సమస్య తలెత్తకుండా చూస్తున్నారా? లేదా? అని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాలకు కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైద్య సిబ్బంది సేవలను సమర్థంగా అందించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని, ప్రజల్లో చైతన్యం నింపాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ సాయినిఖిత, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, హెల్త్‌అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, సీహెచ్‌ఓ కుసుమ, ఏఎన్‌ఎం ప్రశాంతి పాల్గొన్నారు.

మినీ జాబ్‌మేళాలో 47 మంది ఎంపిక

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఉన్న ఏస్ అర్బన్ హైటెక్ సిటీలోని మేధా టవర్స్‌లో గురువారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహించారు. హైటెక్ సిటీలోని ఫస్ట్ సోర్స్ సొల్యూషన్ కంపెనీలో ఉద్యోగాల భర్తీలో భాగంగా ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూల ద్వారా 47 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేసినట్లు చెప్పారు. వీరికి నెలకు రూ.14 వేల వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. ఉపాధి కల్పన శాఖ జేఈఓ విక్టర్‌బాబు, మేధా టవర్స్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఏపీఎస్ఎస్‌డీసీ అసోసియేట్ మేనేజర్ ఎం.వినయ్‌భూషణ్, జిల్లా నియామక కార్యనిర్వాహకులు తుర్లపాటి మధు, ఈడీ ఎగ్జిక్యూటివ్ బీఎస్ఆర్ సుజీత్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం.సోమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం భళా

- పేద విద్యార్థులకు అందుబాటులో పెనమలూరు బాలికల హాస్టల్
- మార్పు పథకం కింద వసతి గృహం అభివృద్ధి
- 100 మంది బాలికలు వసతి పొందేలా ఏర్పాట్లు



పెనమలూరు బాలికల వసతి గృహం

పెనమలూరు: స్థానిక బాలికల వసతి గృహం సర్వహంగులు సమకూర్చుకుంది. విద్యార్థినులకు వసతి సౌకర్యం కల్పించేందుకు సిద్ధంగా ఉంది. మార్పు పథకం కింద పెనమలూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆధునికీకరించారు. జిల్లాలోనే ఈ వసతి గృహాన్ని మోడల్ హాస్టల్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దింది. రూ.25 లక్షలు ఖర్చు చేసి అన్ని వసతులతో అభివృద్ధి చేసింది. డైనింగ్ హాలు, ఆధునిక మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు, విశాలమైన ప్రాంగణం, విద్యుత్ దీపాలు, సీలింగ్ ఫ్యాన్‌లు వంటి వసతులు ఈ హాస్టల్‌లో ఉన్నాయి. ఈ వసతిగృహంలో వసతితో పాటు, భోజనం, ట్యూషన్ అందుబాటులో ఉంటాయి. ఈ వసతి గృహంలో మూడు నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ప్రభుత్వం ఉచితంగా వసతి కల్పిస్తోంది. ఈ హాస్టల్‌లో 100 సీట్లు ఉన్నాయి. 70 సీట్లు ఎస్సీ బాలికలకు ఇస్తారు. ఓసీలకు నాలుగు, ఎస్టీలకు ఐదు, బీసీలకు తొమ్మిది, క్రిస్టియన్‌లకు 12 చొప్పున సీట్లు కేటాయించారు. జూలై పదో తేదీ లోపు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు వసతి గృహంలో సీట్లు మంజూరు చేస్తారు.

ప్రభుత్వ పథకాలు అమలు

పెనమలూరు బాలికల వసతి గృహంలో అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేస్తారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడితో పాటు ఇతర పథకాలు వసతి గృహంలో విద్యార్థులకు అమలు చేస్తున్నారు. వసతి గృహంలో చేరిన విద్యార్థులకు ట్రంకు పెట్టె, స్టీల్‌గ్లాస్, రెండు దుప్పట్లు, చాప, నాలుగు జతల స్కూల్ యూనిఫాం, నెలకు రూ.200 కాస్మొటిక్స్ చార్జీలు, నెలనెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక ట్యూషన్, స్టడీ మెటీరియల్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీలో ఇంటర్‌మీడియెట్‌లో ఉచిత ప్రవేశం కల్పిస్తారు.



వసతి గృహంలో భోజనశాల

రుచికరమైన భోజనం, వసతి

బాలికల వసతి గృహంలో ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తుంది. ఉదయం టిఫిన్ పెట్టి విద్యార్థులను పాఠశాలకు పంపుతారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద భోజనం ఉంటుంది. సాయంత్రం స్నాక్స్, రాత్రి ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం, వసతి కల్పిస్తారు. వారంలో రెండు రోజులు చికెన్, ఐదు రోజులు కోడి గుడ్లు, ఐదు రోజులు పండ్లు అందిస్తారు.

వసతి గృహంలో చేరాలంటే..

బాలికల వసతి గృహంలో చేరాలంటే తల్లిదండ్రులు ముందుగా హాస్టల్ వార్డెన్‌ను కలవాలి. విద్యార్థి టీసీ, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, విద్యార్థి ఫొటోలు మూడు, కుల ధ్రువీకరణపత్రం ఇవ్వాలి. మరిన్ని వివరాలకు 81256 30686 సెల్ నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చు.



ఆధునిక హంగులతో మరుగుదొడ్లు

పరిమితంగా సీట్లు

బాలికల వసతి గృహంలో సీట్లు పరిమితంగా ఉన్నాయి. ఇప్పటికే 35 మంది రెన్యువల్ చేయించుకున్నారు. వసతి గృహంలో చేరే వారు వెంటనే సంప్రదించాలి. వసతి గృహంలో పూర్తి వసతులు ఉన్నాయి.

– కిరణ్మయి, హాస్టల్ వార్డెన్, పెనమలూరు

చెరువు పూడిక తీత పనులు ప్రారంభం

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు పైలెట్ ప్రాజెక్ట్ పక్కనే ఉన్న తొండం గట్టు చెరువు పూడికతీత పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. తొలుత చెరువు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న గ్రామ జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి వనరులను మెరుగుపర్చుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 18 ఎకరాల విస్తీర్ణంలోని పానకాలు చెరువులో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం తొండం గట్టు, ఊర చెరువులో కూడా పూడికలు తీసి పోలవరం కాలువ నుంచి గోదావరి నీటితో నింపనున్నట్లు చెప్పారు. తద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు ఈ చెరువుల్లోని నీటిని తాగునీటి సరఫరాకు వినియోగించనున్నట్లు తెలిపారు. తొండం గట్టు చెరువులో పూడికతీసిన మట్టిని పరిసర గ్రామాల ప్రజలు మెరక పనులకు వినియోగించుకోవాలని కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్ష, కన్వీనర్లు పడమట సురేష్, నీలం ప్రవీణ్‌కుమార్, పార్టీ నేతలు కైలే శివకుమార్, సూరం విజయకుమార్, కొల్లి రాజశేఖర్, జలసూత్రం రామ్మోహన్‌రావు, పలువురు పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



చెరువు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీ

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ ప్రక్రియ ప్రారంభం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు బస్‌పాస్‌ల జారీ ప్రక్రియను ప్రారంభించినట్లు డీఎం పి.శివాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి వరకు బాలికలకు, 12 ఏళ్లలోపు బాలురకు నివాస స్థలం నుంచి పాఠశాలలకు 20 కిలోమీటర్ల దూరం వరకు ఉచితంగా బస్‌పాస్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. ఉచిత పాస్ కోసం విద్యార్థులు పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో గన్నవరం, హనుమాన్‌జంక్షన్ బస్టాండ్లలో సంప్రదించాలన్నారు. సదరు విద్యార్థులు రూ.50 చెల్లించి 2024 ఏప్రిల్ 30వ తేదీ వరకు చెల్లుబాటు అయ్యే ఉచిత బస్‌పాస్‌ను తీసుకోవాలని సూచించారు. హైస్కూల్, కళాశాలల విద్యార్థులు మాత్రం మూడవ వంతు చార్జీ చెల్లించి రాయితీ బస్‌పాస్ పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



ఉంగుటూరు: భూసార పరీక్షలతో భూమిలోని పోషకాల లేమిని తెలుసుకుని, వాటికి అనుగుణంగా సాగు చేస్తే అధిక దిగుబడులు పొందొచ్చని వ్యవసాయశాఖ అధికారి వి.హరీష్ కుమార్ తెలిపారు. మండలంలో జరుగుతున్న మట్టి నమూనా సేకరణను ఏఓ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఆర్బీకేలో వివరాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. మట్టిని ల్యాబ్‌లో పరీక్షించిన తరువాత నేరుగా రైతు ఫోన్‌లోకి వివరాలు పంపడంతోపాటు సాయిల్ హెల్త్ కార్డులు అందజేస్తారని వివరించారు. మట్టి పరీక్షల ఫలితాల అనుగుణంగా పోషకాలను అందజేయడం వలన రసాయన ఎరువుల ఖర్చులు తగ్గి అధిక పంట దిగుబడులు వస్తాయన్నారు. రైతులు పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆర్బీకేలో గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పునర్వ్యవస్థీకరణ

- కంకిపాడు ఐసీడీఎస్ పరిధి మార్పు
- పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలతో ప్రాజెక్టు ఏర్పాటు

కంకిపాడు: ఐసీడీఎస్‌లో పునర్వ్యవస్థీకరణ జరిగింది. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రాజెక్టు పరిధిలో మార్పులు తెచ్చారు. చేసిన మార్పులతో ఈ నెల ఒకటో తేదీ నుంచి నూతన ప్రాజెక్టు కార్యకలాపాలు ఆరంభమయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య స్థితిగతులపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ మరింత సమర్థంగా సాగుతుందని, ఇందుకు పునర్వ్యవస్థీకరణ దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

గతంలో స్వరూపం ఇదీ..

కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం గతంలో కంకిపాడు, పెనమలూరు, విజయవాడ రూరల్ మండలాలతో ఉండేది. ప్రాజెక్టు పరిధిలో 247 అంగన్‌వాడీ కేంద్రాలు నడిచేవి. వీటి పరిధిలో ప్రీస్కూల్ విద్యార్థులకు విద్యాబోధన, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేది.

మారిన స్వరూపం

పునర్వ్యవస్థీకరణ చర్యలతో ఐసీడీఎస్ ప్రాజెక్టు స్వరూపం మారింది. ఇందులో భాగంగానే గతంలో ఉన్న ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చారు. నియోజకవర్గం వారీగా ప్రాజెక్టు స్వరూపంలో మార్పు చేశారు. కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలతో ప్రాజెక్టు ఏర్పాటైంది. మూడు మండలాల పరిధిలో 221 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆ కేంద్రాల్లో 3,184 మంది చిన్నారులు ప్రీస్కూల్ విద్యనభ్యసిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు 3,246 మంది ఉన్నారు. వారందరికీ ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం అందిస్తున్నారు. జూలై నుంచి గర్భిణులు, బాలింతలకు ఇళ్లకే పౌష్టికాహారం అందించేలా మార్పులు జరుగుతున్నాయి. పౌష్టికాహారం కోసం ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన విధించటంతో సిబ్బంది ఈ అంశంపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారాన్ని తీసుకెళ్తున్నారు.



కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

పరిపాలనా సౌలభ్యం కోసం

పరిపాలనా సౌలభ్యం కోసం ప్రాజెక్టుల పరిధిలో మార్పులు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. విజయవాడ రూరల్ మండలాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయటంతో పరిపాలన, ప్రజా ప్రతినిధులు, అధికారుల నడుమ తలెత్తే సమన్వయ లోపాలను అధికమించేందుకు ఒక నియోజకవర్గ పరిధిలో ఒక ప్రాజెక్టు ఉండేలా పునర్వ్యవస్థీకరణ చేశారు.

సమన్వయంతో సమర్థంగా సేవలు



రీ ఆర్గనైజేషన్ ఆమోదయోగ్యంగా ఉంది. ఒకే నియోజకవర్గ పరిధికి రావటం వల్ల పరిపాలనాపరమైన ఇబ్బందులు ఉండవు. ఒకే జిల్లా కిందకూ రావటం సౌకర్యంగా ఉంది. జూలై నెల నుంచి ఆధార్‌కార్డులు తప్పనిసరిగా స్థానికంగా ఉండేలా చూడాలని ఉన్నతాధికారులు సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు స్థానికంగా ఉండేలా చూసుకుంటే పౌష్టికాహారం అందజేతలో సమస్యను అధికమించొచ్చు. సమన్వయంతో సేవలు సమర్థంగా అందించేందుకు కృషి చేస్తున్నాం.

– కె.బి.సుకన్య, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, కంకిపాడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్ దుట్టా

హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు గురువారం కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో డాక్టర్ దుట్టాతో పాటు ఆయన కుమార్తె, ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ దుట్టా సీతారామలక్ష్మి, అల్లుడు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, మనవడు ఆరుష్, సోదరుడు చిన్నాల లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం జగన్ డాక్టర్ దుట్టా యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దుట్టా కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో డాక్టర్ దుట్టా, ఆయన కుటుంబ సభ్యులు

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

గన్నవరం: విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని బలంగా విశ్వసించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు తగ్గట్లుగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బెజవాడ శ్రీరామ్(577 మార్కులు)కు రూ.15 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గన్నవరం జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థిని రెడ్డి పూజిత(575 మార్కులు)కు రూ.10 వేలు, నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మహమ్మద్ సాయిసమీర్(572 మార్కులు)కు రూ.5 వేలు అందజేశారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీలో ప్రథమ స్థానాలు సాధించిన వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలకు చెందిన రమ్య, రేవతిలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు నగదు బహుమతులు అందించారు. అవార్డులు అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించారు. అవార్డులు అందుకున్న ఐదుగురు విద్యార్థులకు ఎమ్మెల్యే వంశీమోహన్ వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున రూ.1.25 లక్షలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీలు యరగొర్ల నాగేష్, వడ్లమూడి సరోజిని, జెడ్పీటీసీ సభ్యులు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, కొమరవల్లి గంగాభవాని, కాకర్లమూడి సువర్ణరాజు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండీ గౌసాని, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ కరిముల్లా, ఎంఈవోలు బి. శ్రీనివాస్, ఆదూరి వెంకటరత్నం, సంధానకర్త కేఎస్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ టాపర్ శ్రీరామ్‌కు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

చిన్నారులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి

కంకిపాడు: చిన్నారులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ కె.బి. సుకన్య అన్నారు. పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను గురువారం అందించారు. ప్రజలను భాగస్వామ్యం చేయటంపై అవగాహన కల్పించారు. కె.బి.సుకన్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందుతుందన్నారు. విద్యతో పాటుతో పౌష్టికాహారాన్ని ప్రభుత్వం సమర్థంగా అందిస్తోందన్నారు. పౌష్టికాహార లోప నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ చిన్నారులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, వార్డుసభ్యులు వంకదారు చిట్టిబ్బాయ్, చిట్టూరి కోటయ్యబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నామణి, సత్య, సిబ్బంది వై.నళినీకుమారి, కోలవెన్ను భవాని, ఎం.రత్నకుమారి, డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు పట్టాలు అందజేస్తున్న సీడీపీఓ సుకన్య తదితరులు

మండలంలో 440 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో ఈ ఏడాది 440 మట్టి నమూనాలను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతి 5 ఎకరాలకు ఒక మట్టి నమూనా సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ నమూనాల విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపి భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్, సేంద్రియ కర్బనం సమాచారంతో రైతులకు కార్డుల ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ వివరాలన్నీ కూడా ఎస్‌హెచ్‌సీ(సాయిల్ హెల్త్ కార్డ్) యాప్ ద్వారా జియో కో-ఆర్డినేట్స్ తో పాటు సేకరిస్తామన్నారు. నిడమానూరు గ్రామంలో గురువారం మట్టి నమూనా సేకరించామని, కార్యక్రమంలో సుంకర గోపాలకృష్ణ, గుండ్రెడ్డి శేషయ్య, వల్లూరు కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

విద్యార్థుల ఉజ్వల భవితే ప్రభుత్వ ధ్యేయం

కంకిపాడు: విద్యార్థుల ఉజ్వల భవితే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు సత్కారం మండల స్థాయి కార్యక్రమం గురువారం జరిగింది. 2022-23 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఘనంగా సత్కరించి, ప్రోత్సాహక బహుమతులు అందించారు. బాకీ బాబు మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. నాణ్యతతో కూడిన విద్యను అందించేందుకు నూతన విద్యావిధానాలను ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. మన బడి నాడు-నేడు కింద పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించిందన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలకు ఉపాధ్యాయులు సమర్థంగా పనిచేయాలన్నారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు బూరగ బాలాజీ, ఏఎంసీ వైస్ చైర్మన్ బిళ్లా వెంకటేశ్వరరావు, నెరుసు సతీష్, హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న బాకీ బాబు, రాజ్యలక్ష్మి తదితరులు

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కంకిపాడు(పెనమలూరు): వివాహితపై హత్యాయత్నం కేసులో నిందితుడైన ఆమె భర్తను కంకిపాడు పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్‌ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. కంకిపాడు పట్టణానికి చెందిన సాలే శాంతి, చంటిబాబు భార్యాభర్తలు. కొద్దిరోజులుగా వారి మధ్య మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన చంటిబాబు చాకుతో భార్య శాంతి పొట్టలో పొడిచాడు. బాధితురాలి ఫిర్యాదుతో చంటిబాబుపై హత్యాయత్నం, వేధింపుల కేసును పోలీసులు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్ల పంపిణీ

నున్న(విజయవాడరూరల్): విద్యార్థుల్లో రక్తహీనత అధిగమించేందుకు దోహదపడే ఐరన్ టాబ్లెట్లను వైద్య సిబ్బంది గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. 147 మందికి టాబ్లెట్లు అందజేసినట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రతి గురువారం ఐరన్ టాబ్లెట్లను అందజేయనున్నట్లు చెప్పారు. ఏఎన్‌ఎం ఆర్.లక్ష్మి, ఆశ వర్కరు పాల్గొన్నారు.